

ప్రజా న్యూస్

— నెటవర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 141,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం , తేదీ : 22-09-2026



ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

ఇక అప్పులపైనే ఆధారపడం

కీలక ప్రాజెక్టులకు నిధుల కోసం ప్రైవేటు పెట్టుబడులపై దృష్టిపెడతాం...

పెట్టుబడిదారుల నష్టభయం తగ్గించేలా ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తాం

30 వేల ఎకరాల్లో నెట్--జీరో మెగాసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ



న్యూఢిల్లీ: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం మిగతా 2 లో

పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్

సొంత నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పర్యటన..

రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం

మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ

తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన



అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని మిగతా 2 లో



దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ సవాల్

- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం
- ప్రకృతి కావాల్సినన్ని నీళ్లు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు"
- అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలి

1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలి

పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు

- ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు: మంత్రి లోకేశ్ నిర్ణయాలు
- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో మిగతా 2 లో

తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు అప్రమత్తం



- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ



- ఏపీలో కొత్త రైల్వే లైన్లు ఏర్పాటుకు రైల్వే శాఖ సన్నాహాలు
- పశ్చిమ, మధ్య భారతం నుంచి ఏపీ పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం
- రాయలసీమ నుంచి పోర్టులకు దూరం తగ్గించేలా కీలక ప్రతిపాదనలు

మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు



- కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదు
- మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా?
- 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?"



అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది



- భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత
- మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి: ప్రజలను కోరిన సీఎం రేవంత్

జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

వైఎస్ జగన్ వార్నింగ్‌తో దిగొచ్చిన చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం
- రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్



విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో కదలిక కనిపించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన సీఎం.. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించనున్నట్లు శనివారం స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతుల సమస్యలు, మిగతా 2 లో

యెమెన్‌లో భీకర పోరు.. 24 గంటల్లో 44 మంది మృతి

ఢిల్లీ: యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్-కడా, అల్-వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మరోవైపు, లహిజ్ ప్రావిన్సులో వ్యూహాత్మకంగా కీలకమైన బాబ్ అల్-మండెబ్ జలసంధి సమీపంలోని కహబూబ్ పర్వత ప్రాంతం స్వాధీనం కోసం జరిగిన పోరులో 12 మంది సైనికులు, ఒక కమాండర్‌తో సహా 15 మంది హౌతీ తిరుగుబాటుదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల ఆరంభంలో హౌతీ రెబల్స్ కీలకమైన మోఖా నౌకాశ్రయంతో పాటు బాబ్ అల్-మండెబ్ జలసంధిలోని మయూన్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు పక్షాలు ఎర్ర సముద్ర మార్గంలోని వివాదాస్పద ప్రాంతాలకు భారీగా బలగాలను తరలిస్తున్నాయి. 2014లో హౌతీలు రాజధాని సనాతో పాటు దేశంలోని ఉత్తర ప్రాంతాలను ఆక్రమించడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. అనంతరం 2015లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగాయి. అప్పటి నుంచి దేశంలో ఘర్షణలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి.

అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

సౌదీకి సాయం చేస్తే ఉక్కు పిడికిలితో బదులిస్తాం

పాక్, టర్కీకి హౌతీల హెచ్చరిక

ఢిల్లీ: యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్, టర్కీ దేశాలకు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సౌదీ అరేబియాకు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా 'ఉక్కు పిడికిలి'తో బదులిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలలో ఈ హెచ్చరికలు చేశారు. "దేవుడి సాక్షిగా చెబుతున్నా.. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతాం" అని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధం లేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు "మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్"పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

వనపర్తి జిల్లా: కాంగ్రెస్ నేతలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని.. దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలన్నారు. శనివారం ఆయన వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమంటూ తేల్చి చెప్పారు. "ప్రభుత్వాన్ని పదిలిపెట్టేది లేదన్న కేటీఆర్.. నీళ్లు ఇవ్వకపోతే గల్లా పట్టుకుని అడుగుతామన్నారు. తాము తప్పు చేశామని తేలితే చర్యలు తీసుకోండి.. అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలన్నారు. రైతులు విద్యుత్, సాగునీటి కష్టాలు చెప్పుకున్నారు.. ప్రకృతి కావాల్సినన్ని నీళ్ళు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు. "ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సామర్థ్యం ఉండేది. 24 వేల మెగా వాట్లకు విద్యుత్ సామర్థ్యం పెంచినం. అత్యల్పంగా కృష్ణా నీళ్లను తెలంగాణ వాడుకుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముప్పై శాతం కంటే ఎక్కువ నీళ్లు వాడుకున్నాం. పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చినం. ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. వరద వస్తుందంటే వెంటనే నీళ్లు మళ్లించే వాళ్లం. ..చెక్ డ్యామ్‌లు, చెరువులు నింపి పాలమూరులో నీళ్లు ఇచ్చాం. రెండు సబ్ స్టేషన్‌లకు రైతులతో కలిసి వెళ్ళాం. అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావట్లేదని రైతులు చెప్తున్నారు. లో వోల్టేజ్, తరచూ కట్ చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని అంటున్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోతుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విద్యుత్ కష్టాలు, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెప్తున్నారు. అన్ని ఉన్నప్పటికీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించే లక్ష్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానిస్తూ, ముఖ్యంగా ప్రధాన ఓడరేవులను కలుపుతూ మొత్తం 9 కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. మధ్య, పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులకు నేరుగా కనెక్టివిటీని పెంచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రయాణ దూరంతో పాటు సరుకు రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. రాయలసీమ, దక్షిణ ప్రాంతాల నుంచి ఓడరేవులకు అనుసంధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 120 కిలోమీటర్ల పొడవైన రాజంపేట – నెల్లూరు రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ఇది రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు నేరుగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, 41.5 కిలోమీటర్ల మేర గూడూరు – దుగరాజపట్నం పోర్టు లైన్‌కు సంబంధించి తుది లొకేషన్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. 88.3 కిలోమీటర్ల పుత్తూరు – అత్తిపట్టు మార్గం చెన్నై ఓడరేవులకు దూరాన్ని తగ్గిస్తుండగా, దీనికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమవుతోంది. ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల కనెక్టివిటీకి కూడా రైల్వే శాఖ ప్రాధాన్యమిచ్చింది. 150 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన చింతూరు – సామర్లకోట రైల్వే లైన్ ద్వారా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కాకినాడ పోర్టుతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. అదేవిధంగా, ఇప్పటికే మంజూరైన ఒడిశాలోని తెరుబాలి – గుణుపూర్ (73.6 కి.మీ) లైన్ ములపేట పోర్టుకు సరుకు రవాణాను మరింత సులభతరం చేయనుంది. వీటితో పాటు, తెలంగాణ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రైలు మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేలా 290 కిలోమీటర్ల పొడవైన సికింద్రాబాద్ – శ్రీశైలం – మార్కాపురం లైన్ కూడా ప్రతిపాదనల్లో ఉంది. గద్వాల – మాచర్ల (184.2 కి.మీ), దొనకొండ – ఒంగోలు (119.6 కి.మీ), దూపాడు – బేతంచెర్ల (53.9 కి.మీ) లైన్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మార్గాలు దొనకొండ, ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతాలను ఓడరేవులతో అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాష్ట్ర వాణిజ్య, ఆర్థిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతాయని భావిస్తున్నారు.

వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

న్యూఢిల్లీ: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ'సదస్సులో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, ఇతర కీలక ప్రాజెక్టుల కోసం ఇకపై ప్రైవేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్‌ను భారీగా సమీకరించే నమూనా వైపు రాష్ట్రం దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్?కను తగ్గించడానికి, వయబిలిటీ గ్యాప్ పూడ్చడానికి ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ మార్గాలను మరింత బలోపేతం చేస్తామని భట్టి వివరించారు.

వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న వికసిత్ భారత్ ప్రయాణంలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2025--26 నాటికి తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇది 10.7 శాతం వృద్ధి అని.. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండి రూ. 4,18,931కి చేరిందని భట్టి గుర్తుచేశారు. ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వివరించారు. రాష్ట్ర సమతుల్య అభివృద్ధి కోసమే క్యూర్, ప్యూర్, రేర్ అనే ప్రత్యేక నమూనాను అమలు చేస్తున్నట్లు భట్టి వివరించారు. అలాగే దేశంలోనే తొలి నెట్--జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 30 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి వెల్లడించారు.

యువతే తెలంగాణ అసలైన బలం...

రాష్ట్ర యువతే తెలంగాణ అసలైన బలమని భట్టి పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. సామాజిక భద్రత, మెరుగైన వైద్యం, మహిళా సాధికారతతో కూడిన సమ్మిళిత అభివృద్ధే రాష్ట్ర విధానమని భట్టి వివరించారు.

జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన

విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన అల్టిమేటం నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో కదలిక కనిపించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, కరువు మండలాలను ప్రకటించాలని జగన్ డిమాండ్ చేసిన మరుసటి రోజే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన సీఎం.. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించనున్నట్లు శనివారం స్వయంగా వెల్లడించారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతుల సమస్యలు, సాగునీటి కొరత, వ్యవసాయ సంక్షోభంపై వైఎస్ జగన్ ఈ నెల 17న పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్లతో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. కరువు మండలాలను ప్రకటించకపోతే ఉద్యమిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు.

వైఎస్ జగన్ ఫైర్

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు, సాగునీటి కొరత, వ్యవసాయ సంక్షోభంపై జగన్ సమీక్షించారు. కరువు కాలంలో రైతులను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. ఎల్‌నినో కంటే 'ఎల్లో నినో'తోనే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందంటూ చంద్రబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జూన్ నుంచి వర్షపాతం లోటు కొనసాగుతున్నప్పటికీ కరువు మండలాలను ప్రకటించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే సాగు గణనీయంగా తగ్గిందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు ప్రకటన

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించారు. సెప్టెంబర్ 24 నాటికి జిల్లా స్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సెప్టెంబర్ 29 నాటికి రాష్ట్రస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించాలని సూచించారు. రాష్ట్రంలో 513 మండలాల్లో కరువు ఛాయలు ఉన్నట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. పంటల పరిస్థితి, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.

హైరిస్క్ కేటగిరీలో 1,357 ఆర్ఎస్‌కేలు

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పరిస్థితులపై ప్రభుత్వం రిస్క్ ఆధారిత అంచనాలు చేపట్టింది. 1,357 రైతు సేవా కేంద్రాల పరిధిలో పంటలను హైరిస్క్ కేటగిరీలో గుర్తించినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఖరీఫ్‌లో వర్షపాతం లోటు నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు పంటల పరిస్థితిని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్యపైనా సమీక్ష

ఇదిలా ఉండగా.. సాగుతో పాటు తాగు నీటి విషయంలోనూ జగన్ వార్నింగ్ పని చేసింది. విశాఖపట్నంలో తాగునీటి సమస్యపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులతో పాటు తాగునీరు, సాగునీటి లభ్యతపై కూడా అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మోటకొండూరు: కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?" అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారని విమర్శించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సాధారణ యువతకు లబ్ధి చేకూరలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదని ఆక్షేపించారు. " కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు. మీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? ఇక్కడ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంపీలు దిల్లీలో కొట్లాడాలి. మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి" అని హరీశ్‌రావు అన్నారు.

తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?: ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

కాంగ్రెస్ నేతలు ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?అని ప్రశ్నించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూముల పరిశీలనకు వెళ్లడంపై ఆయన మండిపడ్డారు. దాడులు చేస్తామన్నవారిని బందోబస్తుతో పంపిస్తున్నారని, తాము నిరసన చేస్తామంటే ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని ఆక్షేపించారు. ఫాంహౌస్‌ల చుట్టూ తిరుగుతున్న వారిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదని ప్రశ్నించారు.

పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్



అమరావతి: ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు. ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన

మద్యపాన నిషేధంపై అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి:

-అక్టోబర్ 7న చలో అమరావతికి భారీగా తరలిరావాలి: ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21 (ప్రజా న్యూస్ నెట్వర్క్): పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపాన నిషేధంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.అదేవిధంగా అక్టోబర్ 7న చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



అమరావతిలో ఆరోజు నిర్వహించనున్న నూతన మండల జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు ఎల్కతుర్తి మండలం నుంచి భారీగా హాజరు కావాలని సూచించారు.ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ కోరారు.సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ మాట్లాడుతూ సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం నాయకులు బొంకూరి వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, మండల నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, అల్లకొండ బాలు మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



జగ్గారెడ్డిని కలిసిన నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 21
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చంద్రశేఖర్ రెడ్డికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.తన నియామకానికి సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జగ్గారెడ్డిలకు చంద్రశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.చంద్రశేఖర్ రెడ్డి నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి.


-డిప్యూటీ కమిషనర్ కి సిపిఐ నాయకులు వినతి.

-సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.21 ప్రజా న్యూస్ నెట్వర్క్..

జగద్గిరిగుట్టలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో అనేక వినతి పత్రాలు ఇస్తే ఇప్పటికీ ఆ కల సాకారమైందని ఈ ప్రాంత అభివృద్ధి కోసమే సిపిఐ ఎల్లప్పుడూ పనిచేస్తుందని మీరు కూడా అభివృద్ధిలో భాగస్వాములై జగద్గిరిగుట్టను అభివృద్ధి చేయాలని కోరుతూ నేడు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కి సిపిఐ నాయకులు సన్మానించి జగద్గిరిగుట్ట లో నెలకోన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, యువజన సంఘం కార్యదర్శి కీర్తి సిపిఐ నాయకులు సదానందం, సహదేవరెడ్డి ,
కే వెంకటేష్, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.





అన్నప్రసాద కార్యక్రమం విజయవంతం

సహకరించిన ప్రతి ఒక్కరికీ ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ కృతజ్ఞతలు

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 21
సంగారెడ్డి ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కార్యక్రమానికి హాజరై తమ విలువైన సమయాన్ని కేటాయించి సహకరించిన ప్రతి ఒక్కరికీ అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సిద్ధిఖీ అన్న, ప్రదీప్ అన్న అందించిన సేవలను ప్రత్యేకంగా అభినందించారు. అన్న ప్రసాదం పూర్తయిన సమయంలోనూ అదనంగా 25 కిలోల అన్నం వడ్డించి భక్తులందరికీ ప్రసాదం అందేలా కృషి చేసిన వారి సేవాభావాన్ని కొనియాడారు.అలాగే 54 రకాల ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో తయారుచేసి అందించిన మహిళా సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి శ్రమ, భక్తి, సహకారంతో కార్యక్రమం మరింత ప్రత్యేకంగా నిలిచిందన్నారు.శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

జయప్రదంగా ముగిసిన యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ

20 తీర్మానాలు ఆమోదం -- ఆరు కమిషన్లపై విస్తృత చర్చ




(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 21
భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (ఖూఖీ×) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగి జయప్రదంగా ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పరిస్థితులు, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించారు.ప్లీనరీలో విద్యార్థుల విద్యా హక్కులు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, స్కాలర్‌షిప్‌లు--ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టళ్ల సమస్యలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ, మౌలిక వసతులు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై 20 తీర్మానాలు ఆమోదించారు. అలాగే ఆరు కమిషన్లపై విస్తృత చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించారు.ఈ సందర్భంగా ఖూఖీ× రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. జిల్లాల వారీగా సంఘాన్ని బలోపేతం చేసి, విద్యార్థులను పెద్ద సంఖ్యలో సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాజేష్, సూరి, సందీప్ ప్రశాంత్, సహాయ కార్యదర్శులు, గర్ల్స్ కన్వీనర్ రేణుక, జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన ముస్లిం మైనార్టీ నాయకులు

హుజూర్‌నగర్‌లో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి వినతి

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హైదరాబాద్‌లో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిని ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి హుజూర్‌నగర్ పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న మైనార్టీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పట్టణంలో మైనార్టీ వర్గాలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ. అజీజ్ పాషా, ఎంఏ అబ్దుల్ మజీద్, ఎస్కే. మన్సూర్ అలీ, ఎస్కే. బిక్కన్ సాహెబ్, సమ్మెట సుబ్బరాజు, ఎస్కే. ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం

-: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద .

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.21 ప్రజా న్యూస్ నెట్వర్క్
2025 - 26 విద్యా సంవత్సరం ఒకేషనల్, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో విద్యార్థులను ప్రోత్సహించి, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంలో తమ జ్ఞానాన్ని పంచిన గురువులను సన్మానిస్తూ కేయం.పాండు మెమోరియల్ ఒకేషనల్ కాలేజ్ వేదికగా గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కళాశాల అధ్యాపకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి విద్యాభివృద్ధికై నిత్యం పాటుపడిన మా నాన్నగారైన మాజీ మున్సిపల్ చైర్మన్, దివంగత నేత కేఎం.పాండు పేరు మీద ఏర్పాటుచేసిన ఈ కళాశాలలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ రాష్ట్రస్థాయి గుర్తింపు పొందేలా ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై వారిని ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రధానోపాధ్యాయులకు, అధ్యాపకులకు నా అభినందనలు. రానున్న రోజుల్లో ఈ కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



గణేష్ నిమజ్జనానికి భారీ భద్రత..

1,200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

-బుధవారం నిమజ్జనాలు పూర్తి చేయాలి.. డీజేలకు పూర్తిగా నిషేధం: ఎస్పీ నరసింహ

-సీసీ కెమెరాలతో నిరంతర నిఘా.. నిమజ్జన కేంద్రాల్లో భారీ క్రేన్లు, గజ ఈతగాళ్ల ఏర్పాటు

(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
సూర్యాపేట జిల్లాలో బుధవారం జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, అన్ని విగ్రహాల నిమజ్జనాలను బుధవారం రోజే పూర్తి చేయాలని ఉత్సవ కమిటీలను కోరారు. జిల్లావ్యాప్తంగా 1,200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. సూర్యాపేట సద్దుల చెరువు, రత్నాపురం మూసీ రివర్, కోదాడ పెద్ద చెరువు, మట్టపల్లి బ్రిడ్జి, పాలకవీడు మహంకాళిగూడెం, నేరేడుచర్ల చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద భారీ క్రేన్లు, లైటింగ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. డీజేలకు పూర్తిగా అనుమతి లేదని, మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం, వాహనాలు నడపడం, టపాకాయలు కాల్చడం, విద్యుత్ తీగల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నీటి వనరులు తక్కువగా ఉన్నందున చెరువులు, నదులను కలుషితం చేయకుండా స్థానికంగా నిమజ్జనాలు నిర్వహించుకోవాలని, అత్యవసర సమయంలో డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



అంగన్వాడీల డిమాండ్లపై కలెక్టరేట్ ఎదుట ధర్నా

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.. బీఎల్ఓ డ్యూటీల నుంచి మినహాయించాలి

అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలి.. ప్రభుత్వ వేధింపులు ఆపాలి

(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, బీఎల్ఓ డ్యూటీల నుంచి అంగన్వాడీ టీచర్లను మినహాయించాలని, అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంపటి గురూజీ మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, అర్హులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించగా, తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, వేతనాల పెంపుపై ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు.



ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

పోలీస్ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో మాట్లాడిన ఎస్పీ నరసింహ ఐపీఎస్

ఫిర్యాదులపై తక్షణ స్పందన.. బాధితులకు భరోసా కల్పించాలి



(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి ం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండి, సమస్యలను పెద్దల సమక్షంలో సామరస్యంగా, చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.

మహాగణపతికి ప్రత్యేక పూజలు

త్రిపురారంలో ఘనంగా మహా అన్నదానం

అంబేద్కర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం



(త్రిపురారం మండలం) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :
త్రిపురారం మండల కేంద్రంలోని పాత చెక్‌పోస్ట్ బజార్‌లో అంబేద్కర్ యూత్ కమిటీ ఏర్పాటు చేసిన మహాగణపతికి సోమవారం అధికారులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కూనిరెడ్డి విజయకుమారి, ఎస్సై కైగూరి నరేష్, సర్పంచ్ బైరం లక్ష్మీకృష్ణ, అనుముల శ్రీనివాసరెడ్డి, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

త్రిపురారం 10వ వార్డులో పర్యావరణహిత వినాయకుడికి పూజలు

మట్టి విగ్రహాల ఏర్పాటు అభినందనీయం: అధికారులు

(త్రిపురారం మండలం) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :
త్రిపురారం 10వ వార్డులో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహాన్ని మండల విద్యాశాఖ అధికారి రవి, పీహెచ్‌సీ డాక్టర్ చింతపల్లి వనిత, సీహెచ్ఓ వాసుదేవరెడ్డి, సూపర్‌వైజర్ పుట్ట గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ అనుముల నాగమణి--పాపిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి విగ్రహాల ఏర్పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు, విగ్రహదాత నల్లగంటి శివన్, కమిటీ సభ్యులు ప్రశాంత్, అరవింద్, మహేష్, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్--కోదాడ బస్‌స్టేషన్లకు మహర్దశ

ఆధునిక సౌకర్యాలతో బస్‌స్టేషన్ల అభివృద్ధికి వేగంగా అడుగులు

ప్రయాణికులకు మెరుగైన వసతులు.. త్వరలో ప్రారంభం కానున్న అభివృద్ధి పనులు

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
బస్‌స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి :
హుజూర్‌నగర్, కోదాడ బస్‌స్టేషన్లను అన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు చర్యలు వేగం పుంజుకోనున్నాయి. ప్రయాణికులకు మెరుగైన వసతులు, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించేలా బస్‌స్టేషన్లను ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.
ప్రయాణికుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం :
బస్‌స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన ఆధునిక వసతులను కల్పిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నిత్యం బస్‌స్టేషన్లను వినియోగించే వేలాది మంది ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.
అభివృద్ధికి ప్రత్యేక చొరవ :
మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రత్యేక చొరవతో హుజూర్‌నగర్, కోదాడ బస్‌స్టేషన్ల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
రవాణా వసతుల్లో మరో ముందడుగు :
హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా బస్‌స్టేషన్ల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజా రవాణా వ్యవస్థ మరింత సౌకర్యవంతంగా మారనుంది. త్వరలో పనులు ప్రారంభం కానుండటంతో స్థానిక ప్రజలు, ప్రయాణికుల్లో ఆసక్తి నెలకొంది.



ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు

పోలీస్ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ నరసింహ ఐపీఎస్

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు.. బాధితులకు తక్షణ భరోసా కల్పించాలి: ఎస్పీ

(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
ఫిర్యాదుదారుల సమస్యలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి :
సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ ఐపీఎస్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.
ఫిర్యాదులపై తక్షణ స్పందనకు ఆదేశాలు :
ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు వేగంగా స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
గొడవలకు దూరంగా ఉండాలి :
ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యంగా, చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని కోరారు.
ప్రజలకు పోలీస్ శాఖ అండగా :



ప్రజా రక్షణ కోసం పోలీస్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ప్రజలకు అవసరమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

పాయకరావుపేటలో గురజాడ జయంతి వేడుకలు..

విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన నాయకులు

బృందావనం పాఠశాలలో నివాళులు.. గురజాడ సాహిత్య, సంఘ సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన

పాయకరావుపేట, సెప్టెంబర్ 21 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:సంఘ సంస్కర్త, సాహితీవేత్త గురజాడ అప్పారావు జయంతిని పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు స్థానిక బృందావనం పాఠశాలలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గురజాడ సాహిత్యం, సంఘ సంస్కరణలపై వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాండురంగ దేవస్థానం చైర్మన్ మజ్జూరి నారాయణరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీను, జనసేన అధ్యక్షుడు ఆచంట దొర, సీనియర్ నాయకులు మల్లిపెద్ది వెంకటరమణ, నారపరెడ్డి పద్మ, జురెడ్డి ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు చిలుకూరి పేర్రాజు, మైలవరం రమేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ఆర్.కె.సిహెచ్. నూకరాజు, కట్ట శ్రీరామ్ మూర్తి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



తునిలో పెన్షనర్ల సర్వసభ్య సమావేశం

పెన్షన్ అంశాలు, ఎస్‌బీఐ సేవలపై వివరించిన ప్రతినిధులు

తుని, సెప్టెంబర్ 21 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తుని శాఖ ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తుని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన ఈ సమావేశానికి ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్. ఆంజనేయ ప్రసాద్ నేతృత్వం వహించగా, తుని శాఖ అధ్యక్షులు ఎం. త్రిమూర్తులు అధ్యక్షత వహించారు.సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా జేఏసీ కో చైర్మన్ పి. మాధవరావు, తుని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె. మునీందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అధ్యక్షులు ఎం. త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ నాయకత్వంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఏ. విద్యాసాగర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు నేతృత్వంలో ముఖ్యమంత్రితో జరిగిన చర్చలకు సంబంధించిన అంశాలను సభ్యులకు వివరించారు. డీఏలు, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రిస్టరేషన్‌కు సంబంధించిన చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రికి, ఎన్జీవో నాయకులకు, రాష్ట్ర సంఘ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గౌరవ అధ్యక్షులు పి. మాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం, ఏపీ ఎన్జీవోస్ జేఏసీ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జరిగిన కృషి, నాయకత్వం తరఫున చేపట్టిన పోరాటం గురించి వివరించారు.ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కె. మునీందర్ రావు బ్యాంకు ద్వారా పెన్షనర్లకు అందుతున్న వివిధ సేవలు, డిపాజిట్లు, ఇతర సదుపాయాలను వివరించారు. పెన్షనర్లు ఎస్‌బీఐ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పెన్షనర్ల సేవల్లో ఎప్పుడూ బ్యాంకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద యాప్స్‌ను ఉపయోగించవద్దని సూచించారు.ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ఆర్. ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ పెన్షనర్లకు ఎస్‌బీఐ సేవలను మరింత సులభతరం చేసి, బ్యాంకు సేవలను వారి ముందుకే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పరంగా పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు, ఇతర డీఏలు, పెన్షన్‌కు సంబంధించిన అంశాలను వివరించారు.ఆర్థిక కార్యదర్శి జి. కృష్ణ సమావేశంలో ఆర్థిక నివేదికను సమర్పించారు. కార్యవర్గ సభ్యులు అప్పలకొండ, అప్పలస్వామి, అమల రాజు, జోసెఫ్, చల్లారావు, స్వామి, రాజుతో పాటు అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.



తండ్రిని కోల్పోయిన మిత్రుడికి పదో తరగతి స్నేహితుల అండ

(గుర్రంపోడు, సెప్టెంబర్ 21, ప్రజా న్యూస్ రిపోర్టర్ గుర్రంపోడు దోటి. శ్రీను)కష్టాల్లో ఉన్న తమ తోటి స్నేహితుడికి అండగా నిలిచి, పదో తరగతి పూర్వ జడ్.పి.హెచ్.ఎస్ పిట్టలగూడ హై స్కూల్ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. గుర్రంపోడు మండలం చామలేడు గ్రామానికి చెందిన పగిడిమర్రి రమేష్ తండ్రి పగిడిమర్రి పరదేశి ఇటీవల మరణించారు.ఈ విషయం తెలుసుకున్న 2001-02 విద్యాసంవత్సరం నాటి ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు చామలేడు గ్రామంలోని పితృవియోగంతో తీవ్ర దుఃఖంలో ఉన్న రమేష్‌ను, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం తమ బ్యాచ్ మిత్రుల తరఫున సేకరించిన 12,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహితులలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తామంతా ఒక కుటుంబంలా కలిసికట్టుగా నిలబడతామని చాటిచెప్పారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటూ, చేతనైన సహాయం అందించే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల బ్యాచ్‌కు చెందిన గుడిపల్లి గిరి, పోలె లింగస్వామి, నగిళ్ళ నగేష్ తదితరులు పాల్గొన్నారు. కష్ట కాలంలో స్పందించి ఆదుకున్న స్నేహితుల బృందాన్ని చామలేడు గ్రామస్తులు అభినందించారు

